నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, శనివారం 1 ఫిబ్రవరి 2025 | MAHABUBABAD

# రామన్న అభినందనలు

**తాజా మాజీ మున్సిపల్ చైర్మన్లు, వైస్‌చైర్మన్లకు సన్మానం**

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం బీఆర్ఎస్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, బానోత్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున-లింగయ్య, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్ ఎండీ ఫరీద్‌కు కేటీఆర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఐదేళ్ల పదవీ కాలం విజయవంతంగా పూర్తి చేసుకున్న రాష్ట్రంలోని బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్‌లతో పాటు వైస్ చైర్మన్లను రామన్న అభినందించారు.

– జనగామ చౌరస్తా/మహబూబాబాద్ రూరల్

**చేపల కోసం కొంగల వేట**

దేవరుప్పుల చెక్‌డ్యాంలో నీరు అడుగంటడంతో పైకి తేలిన చేపల కోసం కొంగలు పోటీపడ్డాయి. ఆహారం కోసం శుక్రవారం ఒకేసారి ఇలా వివిధ ప్రాంతాల నుంచి వందలాదిగా వచ్చిన కొంగల గుంపుతో సందడి నెలకొంది.

– దేవరుప్పుల, జనవరి 31

మైక్‌తో కోతులను తరుముతున్న మల్లక్క

## సౌండ్ వస్తే దౌడే..

వానర సైన్యం ఇళ్లపై పడి నానా బీభత్సం సృష్టిస్తుండడంతో వాటిపై పోరు చేస్తున్నారు. మైక్‌లో కుక్క అరుపును రికార్డు చేసి కోతులను పరుగులు పెట్టిస్తున్నారు. దీంతో మైక్ చూస్తే చాలు కోతులు పరుగులు తీస్తున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రామకృష్ణాపురం (వీ) గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉండడంతో అమ్ముల మల్లక్క అనే వృద్ధురాలు చిన్న మైకులో కుక్కలు మొరిగే సౌండ్ వచ్చేలా రికార్డు చేసింది. దానిని పట్టుకుని ఇంటి ముందు కూర్చోవడంతో పాటు ఇంటి చుట్టూ తిరుగుతుండడంతో భయానికి కోతులు దరిదాపుల్లోకి కూడా రావడంలేదు. ఇది చూసిన స్థానికులు తాము కూడా ఇలానే చేయాలని అనుకుంటున్నారు.

– ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి, జనవరి 31

# ఓట్లు మావే.. సీట్లూ మావే..



సమావేశంలో మాట్లాడుతున్న సుందర్‌రాజ్‌యాదవ్

- బీసీ సర్కార్ కోసమే యుద్ధభేరి సభ
- 42 శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలి
- యుద్ధభేరి సభ ఆరంభం మాత్రమే..
- కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్

హనుమకొండ చౌరస్తా, జనవరి 31 : 77 ఏండ్లుగా బీసీలను అణగదొక్కారని, ఇక వారి ఆటలు సాగవనే పరిస్థితికి బీసీలు చేరుకున్నారని, ఓట్లు మావే.. సీట్లూ మావేనని కుడా మాజీ కుడా చైర్మన్, బీసీ వరంగల్ జేఏసీ చైర్మన్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 2న హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో నిర్వహించనున్న బీసీ రాజకీయ యుద్ధబేరి సభ బీసీ సర్కార్ కోసమేనన్నారు. ఇది ఆరంభ సభ మాత్రమేనని, 15 లక్షల మందితో హైదరాబాద్ జింఖాన గ్రౌండ్‌లో విజయభేరి మోగిస్తామన్నారు. హనుమకొండలో రేపు నిర్వహించే రాజకీయ యుద్ధబేరి సభ.. విజయ భేరి సభగా మారబోతున్నదన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌తో పాటు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో మొదలు పెట్టి, ఎమ్మెల్యే, ఎంపీ సీట్లలో సైతం 50శాతం సీట్లు కేటాయించాలని, లేకపోతే మీ పార్టీలకు పుట్టగతులుండవని హెచ్చరించారు. 6.2 శాతం ఉన్న మీకు 10 శాతం రిజర్వేషన్లు ఎందుకని ప్రశ్నించారు. వెంటనే ఈడబ్ల్యూఎస్ కోటాను రద్దు చేయాలని, లేకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. బీసీలను బానిసలుగా.., సేవకులుగానే చూశారే తప్పా లీడర్లుగా గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల్లో వేర్వేరు కులాలున్నప్పటికీ ప్రస్తుతం బీసీలంతా ఒకే కులంగా, అది బీసీ కులంగా ఒక్కతాటిపైకి వచ్చామని, ఈ సభ ఒక్క తెలంగాణకే కాదు యావత్ భారతదేశంలో కూడా ఓ విప్లవం తీసుకురాబోతున్నదన్నారు. సభకు పోలీసు అధికారులు సహాయసహకారాలు అందించాలని కోరారు. బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు ముఖ్యఅతిథులుగా డీఎంకే పార్టీ ఎంపీ విల్సన్, ఆర్జేడీ పార్టీ ఎంపీ మిస్సాయాదవ్, ఎస్పీ పార్టీ ఎంపీ ధర్మేంద్రయాదవ్, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, మధుసూనాచారి, బస్వరాజు సారయ్య, తీన్మార్ మల్లన్న, సినీ యాక్టర్ సుమన్‌గౌడ్ పాల్గొంటారని తెలిపారు. ఖమ్మం-నల్గొండ-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఆశీర్వదించాలని సుందర్‌రాజ్ యాదవ్ కోరారు. 32 ఏళ్లుగా విద్యా వ్యవస్థలో ఉన్న తనకు ఉపాధ్యాయుల సమస్యలు తెలుసని, మండలిలో వారి సమస్యలపై గళమెత్తుతాని తెలిపారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్, కుల సంఘాల నాయకులు బోనగాని యదగిరిగౌడ్, గిరబోయిన రాజయ్య, వేణుగౌడ్, పులి రజినీకాంత్ ముదిరాజు, బుట్టి శ్యాంయాదవ్, మల్లేశం, నరేశ్‌గౌడ్, నరేందర్, శ్రీనివాస్, అరుణ, ఓదేలు, సోమయ్య, కనకరాజు, సురేందర్, శివశంకర్, రాజగోపాల్, రాజమహ్మద్, వేణుగోపాల్, కుమారస్వామి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పల్లా కృషితో పల్లె రోడ్లకు మహర్దశ

జనగామ చౌరస్తా, జనవరి 31 : ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కృషితో జనగామ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ వచ్చింది. జనగామ, చేర్యాలలో బీటీ, పీడబ్ల్యూడీ రోడ్ల మరమ్మతు పనుల కోసం ప్రభుత్వం నుంచి రూ.9.31 కోట్లు మంజూరు చేయించారు. ఈమేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ నుంచి జీవో నంబర్ 59 ద్వారా ప్రొసీడింగ్స్ ఉత్తర్వులు విడుదలయ్యాయి. పెంబర్తి నుంచి పోచన్నపేట గ్రామాల పరిధిలో 7.90 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు పనులతో పాటు కమలాయపల్లి వయా తాడూరు, చిట్యాల గ్రామాల మీదుగా పీడబ్ల్యూడీ రోడ్డు 9.70 కిలోమీటర్లు కలిపి మొత్తంగా 17.60 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతు పనులకు అనుమతులు వచ్చాయి. రహదారులతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని బలంగా విశ్వసించిన ఎమ్మెల్యే పల్లా, ఈ నిధుల మంజూరు కోసం తీవ్రంగా శ్రమించారు.

*రైలు కూత ఎప్పుడు వినిపిస్తుంది? తాము ఎన్నడు ప్రయాణించేది? ఇది కోల్ బెల్ట్ ప్రాంత ప్రజల్లో ఏళ్ల తరబడిగా ఉన్న కోరిక. బొగ్గుతో పాటు ప్రజా రవాణాకు అనుకూలమైన రామగుండం-మణుగూరు కొత్త రైల్వేలైన్ ఏర్పాటు కలగానే మిగులుతున్నది. కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఈ రైలు మార్గం సర్వే కోసం నిధులు మంజూరు చేయడం.. ప్రక్రియ మొదటికి రావడం పరిపాటిగా మారింది. అటవీ శాఖ అభ్యంతరాలు.. ఏటా బడ్జెట్‌లో కేటాయింపుల కోసం ఎదురుచూపులతోనే కాలం గడిచిపోతున్నది. కొద్ది నెలల క్రితం ఈ అంశం మళ్లీ తెరమీదకు వచ్చింది. రైల్వే శాఖ సర్వే కోసం నిధులు కేటాయించి.. ఆర్డీవోలకు భూసేకరణ బాధ్యతలు అప్పగించింది. అయితే ఇందుకు సంబంధించి విధివిధానాలు, రూట్‌మ్యాప్ అందించకపోవడంతో ఆర్డీవోలు క్షేత్రస్థాయిలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కాగా, శనివారం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఈ రైల్వే లైన్‌కు నిధులు కేటాయించేనా? పాతికేళ్ల తమ నిరీక్షణ ఫలించేనా అని కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.*

*- జయశంకర్ భూపాలపల్లి, జనవరి 31 (నమస్తే తెలంగాణ)*

# పాతికేళ్ల నిరీక్షణ ఫలించేనా !

**మూడేళ్లు కొనసాగి మళ్లీ మొదటికి..**

**2014లో సర్వే కోసం రూ. 10 కోట్లు కేటాయింపు**

## ఈ సారైనా రామగుండం-మణుగూరు రైల్వేలైన్ పట్టాలెక్కుతుందా?

- రూ. 2,911 కోట్ల అంచనా వ్యయంతో మళ్లీ సర్వేకు నిర్ణయం
- నేటి కేంద్ర బడ్జెట్‌లోనైనా కేటాయింపులు జరిగేనా?
- కొత్త రైలు మార్గం కోసం ఆశగా ఎదురుచూస్తున్న కోల్ బెల్ట్ ప్రజలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాను కలుపుకుంటూ పోయే రామగుండం-మణుగూరు రైలు మార్గం ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమవుతున్నది. ఈ రైల్వే లైన్ సర్వే కోసం 2014లో కేంద్రం రూ. 10 కోట్లు కేటాయించింది. అప్పటి నుంచి 2017 వరకు సర్వే కొనసాగి మళ్లీ మొదటికొచ్చింది. ఇప్పటికే కోట్లాది రూపాయలు సర్వే కోసం రైల్వే శాఖ వెచ్చించినా ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఇటీవల రైల్వేశాఖ రూ. 2,911 కోట్లతో అంచనాలు రూపొందించి సర్వేకు ఆదేశించింది. రామగుండం నుంచి మణుగూరు వరకు 207.80 కిలోమీటర్ల పొడవునా సర్వే చేసి, భూ సేకరణ జరపాలని రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని మల్హార్, భూపాలపల్లి, గణపురంతో పాటు పెద్దపల్లి జిల్లాలోని ముత్తారం, మంథని, రామగిరి మండలాల పరిధిలో సర్వే చేయాలని ఆర్డీవో, సబ్ కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌లకు బాధ్యతలు అప్పగించింది. అయితే భూ సేకరణకు సంబంధించి రైల్వే శాఖ ఎలాంటి విధి విధానాలు ఖరారు చేయకపోవడం, ఏయే గ్రామాల నుంచి రైలు మార్గం వెళ్తుందో రూట్ మ్యాప్ ఇవ్వకపోవడంతో అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే చేయలేకపోతున్నారు. దీంతో ఈ సారైనా కొత్త రైల్వే మార్గానికి నిధుల కేటాయింపు జరిగేనా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

### కొత్తలైన్‌తో ఎంతో మేలు

రామగుండం-మణుగూరు కొత్త రైల్వే లైన్‌తో బొగ్గు రవాణా సౌకర్యంతో పాటు ప్రజలకు ఎంతో మేలు జరగనుంది. ఈ మార్గం పూర్తయితే మణుగూరు , భూపాలపల్లి ఏరియా నుంచి సుమారు 70 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా అవుతుంది. ఈ క్రమంలో ఈ ప్రాంతం కోల్ కారిడార్‌గా అభివృద్ధి చెందే అవకాశముంది. మణుగూరు నుంచి రామగుండం వరకు 9 రైల్వే స్టేషన్లు ఏర్పాటు చేసే వీలుందని సింగరేణి అధికారులు చెబుతున్నారు. బొగ్గుతో పాటు ప్రయాణికుల రైళ్లు నడిపితే భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి ప్రాంత ప్రజలకు సౌకర్యవంతంగా ఉండడంతో పాటు మేడారం జాతర భక్తులకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. రామగుండం నుంచి వయా కొత్తగూడెం మీదుగా మణుగూరు వెళ్లాలంటే 349 కిలోమీటర్లు ఉంటుంది. కొత్తగా ఏర్పాటు చేసే రైల్వేలైన్ 207 కిలోమీటర్లు ఉండనుండగా త్వరగా గమ్యం చేరుకోవచ్చు.

### పెట్టుబడి కూడా వచ్చేలా లేదు

ఎకరం 20 గుంటల్లో మిరుప తోట వేసిన. మొదట్లో వానలకు పంట ఎర్రబారింది. పురుగు మందులు కొట్టడంతో గతేడాది కంటే మంచిగా మిరుప కాసింది. కానీ, ఏం లాభం.. గత ఏడాది క్వింటా మిర్చి రూ.20వేల నుంచి రూ.24 వేలు ఉంటే, ఇప్పుడు రూ.14వేల కంటే తక్కువగా ఉంది. మిరుప కాయలు ఏరేందుకు కూలీలకు కిలోకు రూ.15 చొప్పున ఇచ్చిన. కూలీలకు కట్టించిన ధర కంటే తక్కువ ధర ఉన్నది. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు ఎట్లా తీర్చాలి. ప్రభుత్వం మాకు రైతు బంధు కూడా ఇయ్యాలె.

– జాటోత్ దేసు, ఎర్రచర్యతండా

### బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే గిట్టుబాటు ధర

2 ఎకరాల్లో మిర్చి వేసిన. రూ.2లక్షల పెట్టుబడి అయింది. ఇప్పుడు ధర లేక ఇబ్బంది పడుతున్నా. ప్రభుత్వ మిర్చి రైతులను పట్టించుకోవడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ధాన్యం, మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించింది. కేసీఆర్ రైతులను కళ్లలో పెట్టుకొని కాపాడుకున్నరు. రైతుబంధు, రైతుబీమా పథకాలతో రైతుల గుండెల్లో నిలిచిపోయారు.

– పీ వెంకటేశ్వర్లు, రైతు, తోడేళ్లగూడెం

### కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు. గతం లో ఉన్న ప్రభుత్వ పథకాలకు కోత పెట్టింది. మిర్చి ధర లేక ఇబ్బంది పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టిన ట్లు కూడా లేదు. గతం లో రూ.22 వేల వరకు మిర్చి ధర ఉండే ది. ఇప్పుడు అమాంతం పడిపోయింది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. మిరుపకు గిట్టుబాటు ధర కల్పించాలి.

– బిల్లకంటి బజార్, తోడేళ్లగూడెం

ఏరిన మిరప కాయలను ఎండ పెడుతున్న రైతులు

# ధర లేక దిగాలు

- మిరప రైతుకు కష్టాలు
- గతేడాది క్వింటాలు ధర సుమారు రూ.24వేలకు పైనే..
- ఈ ఏడాది జిల్లాలో పెరిగిన మిరప సాగు విస్తీర్ణం
- ప్రస్తుతం అమాంతం పడిపోయిన ధరలు
- క్వింటాలుకు రూ.12వేల నుంచి రూ.14వేలే..
- పెట్టుబడి కూడా వచ్చేలా లేదని అన్నదాతల ఆవేదన
- అప్పులు చెల్లించేందుకు తిప్పలు

*గత ఏడాది మురిపించిన మిరప ఈ ఏడాది రైతులకు కన్నీళ్లను తెప్పిస్తున్నది. కిందటేడాది క్వింటాలుకు సుమారు రూ.24వేల వరకు పలికిన ధర ఈ ఏడాది అమాంతం రూ.14వేలకు పడిపోవడంతో అల్లాడిపోతున్నారు. ఓ పక్క రైతుభరోసా రాక, మరోపక్క పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేక మిర్చి రైతులు పంటను అమ్మాలా.. వద్దా అనే ఆలోచనలో పడిపోయారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని వేడుకుంటున్నారు.*

*- నర్సింహులపేట/డోర్నకల్, జనవరి 31*

నర్సింహులపేట/ డోర్నకల్, జనవరి 31 : గత ఏడాది మురిపించిన మిరప ఈ ఏడాది రైతులకు కన్నీళ్లను తెప్పిస్తున్నది. లక్షల్లో పెట్టుబడి పెట్టి, ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అన్నదాతలు ఆగమవుతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదని దిగాలు చెందుతున్నారు. ఓ పక్క తెగుళ్లతో దిగుబడి తగ్గినా.. ధర ఉంటుందని ఆశ పడిన రైతులకు నిరాశే మిగిలింది. వ్యవసాయ మార్కెట్‌కు పెద్దఎత్తున మిర్చిపంట తరలిరావడం.. గోదాముల్లో గతేడాది పంట పేరుకుపోవడం.., అంతర్జాతీయంగా ఎగుమతులు తగ్గడంతో మిర్చిపంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. రోజురోజుకూ ధరలు పడిపోతున్నాయి. జిల్లాలో వాణిజ్య పంటల్లో మిరపది అగ్రస్థానం కాగా, తర్వాతి స్థానంలో వరి, పత్తి సాగు చేస్తున్నారు. గతేడాది మిర్చి క్వింటాలుకు రూ.24వేల వరకు ధర పలుకడంతో ఈ ఏడాది రైతులు ఎర్ర బంగారం సాగువైపు మళ్లారు. లక్షల్లో అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 55వేల ఎకరాల్లో మిర్చి తోటలు సాగు చేశారు. మెట్టభూముల్లోనూ సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. కాగా, ఈ సారి వర్షాభావ పరిస్థితులతో మిరుప మొక్కలు సరిగ్గా పెరగలేదు. పై మందులతో నెట్టుకొచ్చిన రైతుకు మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా తుఫాన్ కోలుకోలేని దెబ్బతిసింది. అయినా, వివిధ రకాల పురుగుల వాడి, కంటికి రెప్పలా పంటలను కాపాడుకున్నారు. ఎన్నో నష్టాలకోర్చి పంట పండించారు. ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకొచ్చి కిలోకు రూ.15 చొప్పున చెల్లించి పంటను ఏరించారు. చేతికొచ్చిన పంటను తీరా మార్కెట్‌కు తరలించే క్రమంలో ధరలేక అన్నదాత అల్లాడిపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మిరప క్వింటాలుకు రూ. 12వేల నుంచి 14వేల వరకు ధర పడిపోవడంతో అయోమయంలో పడిపోయారు. రూ.లక్షల్లో అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి పంట సాగు చేశామని, ధర లేకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన చెందుతున్నారు. కేసీఆర్ రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడి ఇచ్చి ఆదుకున్నదని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అదికూడా ఇవ్వలేదని, అసలు రైతులను పట్టించుకోవడం లేదని దిగాలు చెందుతున్నారు.

మిరప కాయలు ఏరుతున్న కూలీలు

## మహా కుంభమేళాకు అదనపు ప్రత్యేక రైళ్లు

**కాజీపేట మీదుగా నడుపుతున్న రైల్వే శాఖ**

కాజీపేట, జనవరి 31 : మహా కుంభమేళాను పురస్కరించుకొని ఫిబ్రవరిలో పలు అదనపు ప్రత్యేక రైళ్లను కాజీపేట స్టేషన్ మీదుగా నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. వీటిని బీదర్- దానాపూర్-చర్లపల్లి స్టేషన్‌ల మధ్య నడుపుతున్నామన్నారు. ఫిబ్రవరి 14న బీదర్ నుంచి 07111 నంబర్‌తో మధ్యాహ్నం 11.10 గంటలకు బయలు దేరి మరుసటి రోజు రాత్రి 11.55 గంటలకు దానాపూర్‌కు చేరుకుంటుంది. తిరిగి 07112 నంబర్‌తో దానాపూర్ నుంచి ఫిబ్రవరి 16 మధ్యాహ్నం 3.15 గంటలకు బయలు దేరి మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. అలాగే 18, 20 తేదీల్లో 07077 నంబర్‌తో చర్లపల్లి నుంచి మధ్యాహ్నం 3.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.55 గంటలకు దానాపూర్ చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో 20, 24 తేదీల్లో 07078 నంబర్‌తో మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు చర్లపల్లికి చేరుకుంటాయి.

వీసీ నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న రామచంద్రం

## కేయూ రిజిస్ట్రార్‌గా రామచంద్రం

**మల్లారెడ్డి నుంచి బాధ్యతల స్వీకరణ**

హనుమకొండ చౌరస్తా, జనవరి 31 : కాకతీయ విశ్వవిద్యాలయ నూతన రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ వీ రామచంద్రం నియమితులయ్యారు. వీసీ ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు అడ్మినిస్ట్రేషన్ విభాగ సహాయ రిజిస్ట్రార్ ప్రణయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రామచంద్రం విశ్వవిద్యాలయంలో 1991లో ప్రవేశించారు. గతంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా, విశ్వవిద్యాలయ అభివృద్ధి అధికారిగా, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతిగా, పాఠ్యప్రణాళికా అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం దూరవిద్యా కేంద్ర సంచాలకులుగా, సైకాలజీ విభాగాధిపతిగా, కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్‌గా, విశ్వవిద్యాలయ విద్యా కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. 47 సెమినార్లు, కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యారు. 34కు పైగా పత్రాలను వివిధ సెమినార్లలో సమర్పించారు. 2 పుస్తకాలు రాశారు. 31పైగా పబ్లికేషన్‌లు కలిగి ఉన్నారు. శుక్రవారం ఆయన ప్రొఫెసర్ మల్లారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు.